పెట్రోల్ బంకుల్లో దోపిడీకి పాల్పడుతున్న ముఠాకు రిమాండ్

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, ఆగస్టు 3: పెట్రోల్ బంకుల్లో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖరరాజు వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లాకు చెందిన వేముల శ్రీనివాస్‌రావు, అనాల శివ, పడితం సిద్ధార్థరెడ్డి, నీలటూరి రవికుమార్, మాలపాటి శౌరి ముఠా ఏర్పాడ్డారు. వీరు బంధువులు ఆసుపత్రుల్లో ఉన్నారని బంక్ సిబ్బందిని మభ్య పెట్టి నగదు కావాలని ఇటీవల జిల్లాలో ఏడు పెట్రోల్ బంకుల్లో స్వైపింగ్ మిషన్ల ద్వారా ఏటీఎం కార్డుతో స్వైప్ చేసి మోసానికి పాల్పడుతున్నారు. ఇటీవల బంకుల యజమానుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి విచారించామని తెలిపారు. పెట్రోల్ బంకుకు వెళ్లి స్వైపింగ్ మిషన్ ద్వారా ఏటీఎం కార్డుతో డబ్బులను బదిలీ చేస్తామని తమకు నగదు ఇవ్వాలని దానికి కొంత కమీషన్ ఇస్తామంటూ బంక్ సిబ్బందిని మభ్యపెడుతారు. ముందుగా అనుకున్న ప్రకారమే స్వైపింగ్ మిషన్‌లో ఏటీఎంతో నగదును బదిలీ చేసి సిబ్బందికి చూపిస్తారు. తరువాత వారిని మాటల్లో పెట్టి వీఓఐడీ అనే ఆప్షన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన డబ్బులను వెనక్కి తీసుకుంటున్నారు.

ఈ విధంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో నేరేడుచర్ల, వాడపల్లి, మిర్యాలగూడ, వేములపల్లి, మాడ్గులపల్లి, తిప్పర్తి, నల్లగొండ పెట్రోల్ బంక్‌ల వద్ద నేరాలకు పాల్పడినట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.1.80లక్షల నగదు, రెం డు సెల్‌ఫోన్లు, క్రెడిట్‌కార్డు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, వేములపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్

దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా అడ్డుకుంటున్న పోలీసులు

మిర్యాలగూడ, ఆగస్టు 3: మిర్యాలగూడలో ప్లాస్టిక్ కవర్ల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. క్యాంప్ కార్యాలయంలో శనివారం పట్టణంలోని పలు సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని, అమ్మకాలను పూర్తిగా తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ కవర్ అనేది లేకుండా చేయాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందన్నారు. ఆగస్టు 15 నాటికి మిర్యాలగూడ నియోజకవర్గం పూర్తిగా ప్లాస్టిక్ కవర్ల రహితంగా మారేందుకు అందరు బాధ్యతగా కృషి చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం ప్లాసిక్ కవర్ల నిషేధానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. జూట్ బ్యాగులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో సరికొండ ప్రీతంరాజు, ఆర్య సమాజం కమిటీ సభ్యులు, చెరుపల్లి కరుణాకర్, గూడూరు శ్రీనివాస్, అంకెనపల్లి సుధాకర్, తిప్పన వెంకట్ రెడ్డి, రామచందర్ ఉన్నారు.

డీసీసీబీ డైరెక్టర్ ఆంజయ్యకు మండలి చైర్మన్ గుత్తా పరామర్శ

నిడమనూరు : శ్రీ హర్ష మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నిడమనూరు, ఆగస్టు 3: మండకేంద్రానికి చెందిన డీసీసీబీ డైరెక్టర్ విరిగినేని అంజయ్య కుమారుడు శ్రీహర్ష శుక్రవారం గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే. శ్రీ హర్ష శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్‌కుమార్, నల్లబోతు భాస్కర్‌రావు శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆంజయ్యను పరామర్శించారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీహర్ష అంతిమయాత్రలో పాల్గొన్నారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు తాటి సత్యపాల్, కూరాకుల వెంకటేశ్వర్లు, రవినాయక్, పిడిగం నాగ య్య, హాలియా పట్టణ అధ్యక్షుడు వడ్డె సతీశ్‌రెడ్డి, హాలియా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, సురభిరాంబాబు ఉన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్

శాలిగౌరారం, ఆగస్టు 3 : ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని బూటకపు మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నిరుద్యోగులను మోసం చేసిందని బీఆర్ఎస్వీ తుంగతుర్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చెవుగాని అశోక్‌గౌడ్ విమర్శించారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి భర్తీ చేస్తామని, అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచినా నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగులను నిండా మోసం చేసిందని విమర్శించారు.

మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్‌గా బలరాం బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న బలరాం

మిర్యాలగూడ, ఆగస్టు 3: మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్‌గా బి.బలరాం శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2020లో గ్రూప్ అధికారిగా ఉద్యోగం సాధించిన బలరాం అబ్దుల్లాపూర్‌మెట్, సూర్యాపేట, బీబీనగర్‌లలో పనిచేశారు. ఇటీవల బదిలీల్లో ఆయనను మిర్యాలగూడకు బదిలీ చేశారు.

ఉరుమడ్ల జడ్పీహెచ్ఎస్‌ను డీఈఓ తనిఖీ

- విద్యార్థులకు గణితం బోధించడం లేదని అందిన ఫిర్యాదు

చిట్యాల, ఆగస్టు 3 : మండలంలోని ఉరుమడ్ల జడ్పీహెచ్ఎస్‌ను డీఈఓ భిక్షపతి శనివారం తనిఖీ చేశారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి 6,7 తరగతుల విద్యార్థులకు గణితం బోధించడం లేదు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు డీఈఓకు ఫిర్యాదు చేయడంతో పాటు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లారు. దాంతో ఆయన అధికారులకు సమాచారం ఇవ్వడంతో కొద్ది రోజులు పాఠాలు బోధించారు. అనంతరం మళ్లీ కథ మొదటికే వచ్చింది. ఉపాధ్యాయుల మధ్య ఉన్న పోటీ, నిబంధనల సాకుతో గణితం పాఠాలు బోధించడం లేదు. కావాల్సిన సిబ్బంది ఉన్నప్పటికీ నిబంధనల సాకుతో పోటీతోనే పాఠాలు బోధించడం లేదని తెలుస్తున్నది. దాంతో తల్లిదండ్రులు మళ్లీ డీఈఓకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, కలెక్టర్, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ల దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో సమస్య తీవ్రంగా మారింది. ఈ నేపథ్యంలో డీఈఓ భిక్షపతి పాఠశాలను తనిఖీ చేసి, ఈ విషయంపై సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ సదరు ఉపాధ్యాయుల నుంచి సరైనా స్పందన లేదని, దాంతో ఆయన ఆగ్రహించి వెళ్లినట్లు సమాచారం. ఈ విషయంపై ఎంఈఓను నర్సింహను వివరణ కోరడానికి ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

నిబంధల ప్రకారం చర్యలు తీసుకుంటాం

సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం. పాఠశాలలో గణితం బోధించే విషయంలో సమస్య ఉన్నమాట వాస్తవమేనని, అందుకోసమే పాఠశాలను తనిఖీ చేశా. – భిక్షపతి, డీఈఓ

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల నిరసన

మునుగోడు: సామాజిక చైతన్య దీక్షల పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాతీయమాల మహానాడు నాయకులు

మునుగోడు, ఆగస్టు 3: సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలో జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం నోటికి నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ నెల 7,8,9 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించే సామాజిక చైతన్య దీక్షల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ మాలమహానాడు స్టీరింగ్‌కమిటీ సభ్యుడు గోలి సైదులు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకమని దళితుల విభజన ప్రయత్నాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు సీఎం రేవంత్‌రెడ్డి మద్దతు ఇవ్వడం సమంజసం కాదని ముందుముందు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పెరుమాండ్ల ప్రమోద్‌కుమార్, బెల్లపు బాలశివరాజు, చలిచీమల యాదయ్య, జంగిలి నాగరాజు, బొల్లు సైదులు పాల్గొన్నారు.

దామరచర్ల : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దేశంలోని అన్ని పార్టీలను, వివిధ సంఘాలను ఏకీకృతం చేసి పోరాటాలు చేస్తామని మాల మహానాడు జిల్లా నాయకులు బైరం నర్సయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. న్యాయనిపుణలతో చర్చించి సర్వోత్తమ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు పల్లా సుదర్శన్, బైరం భిక్షం, బైరం గురువయ్య, బైరం శ్యాంసుందర్, కూరపాటి ప్రభాకర్, బైరం దయానంద్, పల్లా శ్రీను, రాంప్రసాద్ పాల్గొన్నారు.

సైదమ్మకు న్యాయం చేస్తాం : సీఈఓ శ్రీనివాస్

- బాధితురాలిని పీఏసీఎస్‌కు పిలిపించుకొని హామీ ఇచ్చిన అధికారులు

పగడాల సైదమ్మతో మాట్లాడుతున్న పీఏసీఎస్ సీఈఓ శ్రీనివాస్

మర్రిగూడ, ఆగస్టు 3: మండలకేంద్రానికి చెందిన పగడాల శంకర్ తీసుకున్న రూ.50వేల పంట రుణం మాఫీ చేసి అతడి భార్య సైదమ్మకు న్యాయం చేస్తామని పీఏసీఎస్ సీఈఓ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. 'కాళ్లు మొక్కిన పట్టించుకుంటలేరు' అనే ఉప శీర్షికతో నమస్తే తెలంగాణ దినపత్రికలో శుక్రవారం ప్రచురిత మైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. శనివారం బాధితురాలు సైదమ్మనుకార్యాలయానికి పిలిపించుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక కారణాల వల్ల చనిపోయిన శంకర్ పేర ఉన్న పంట రుణం మాఫీ కాలేదన్నారు. అతడి పేర మీద ఉన్న రూ. 50 వేల రుణం మాఫీ చేసేందుకు చర్యలు తీసుకోవడమే కాకుండా, పంట రుణం మంజూరు చేయించి ఆదుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. మూడు వారాల్లోగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని సీఈఓ వెల్లడించారు. ఈ సందర్భంగా సైదమ్మ నమస్తే తెలంగాణ దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపింది.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

త్రిపురారం, ఆగస్టు 3: మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న నర్లకంటిగూడెం గ్రామంలో శనివారం సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ సాయంతో రూ.50లక్షల తో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను మాజీ ఎంపీపీ సలహాదారు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, నిడమనూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బహునూతల నరేందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ముడిమళ్ల బుచ్చిరెడ్డి, గుండెబోయిన నగేశ్‌యాదవ్, కోటేశ్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ రాము, సోమయ్య, రామ్మూర్తి, వెంకయ్య పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్ కోసం బీసీల ఆందోళన

మిర్యాలగూడ , ఆగస్టు 3 : బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్‌గౌడ్ మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌ను 42శాతానికి పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

అలాగే నామినేటెడ్ పోస్టుల్లో రాష్ట్ర వ్యాప్తంగా బీసీలకు అవకాశం కల్పించాలని, మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీని బీసీలకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో పల్లా వెంకటయ్య, నక్క నగేశ్, జెల్లా వెంకటేశ్వర్లు, సైదులు, రామకృష్ణ, విష్ణు, శ్రీను, రాములు, నాగయ్య పాల్గొన్నారు.

జిల్లాలో పలువురికి ఏఈఈ పోస్టులు

నిఖిత

వెంకటేశ్

గోపాల కృష్ణ

విక్రమ్

నకిరేకల్ :తల్లిదండ్రులు సత్యనారాయణ, సరితతో మనోజ్‌కుమార్

కట్టంగూర్, ఆగస్టు 3 : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన టీజీపీఎస్సీ ఫలితాల్లో జిల్లాకుచెందిన విద్యార్థులు, ఉద్యోగులు ఏఈ పోస్టులకు ఎంపికయ్యారు. కట్టంగూర్ మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా ఎంపికయ్యారు. కట్టంగూర్‌కు చెందిన కానుగు నిఖిత అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ సివిల్ ఇంజనీర్‌గా, అయిటిపాముల గ్రామానికి చెందిన కావటి వెంకటేశ్ మిషన్ భగీరథ ఏఈ ఎంపికయ్యారు. వెంకటేశ్ ఘట్‌కేసర్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్, నిఖిత ఉస్మానియా ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటెక్ పూర్తి చేశారు. ఇరువురు ప్రభుత్వ సర్వీసుల పట్ల మక్కువతో మొదటి ప్రయత్నంలో ఉద్యోగాలు సాధించారు. నిఖిత తండ్రి వెంకన్న డ్రైవర్‌గా, వెంకటేశ్ తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తున్నారు.

పెద్దవూరలో..

పెద్దవూర : మండలంలోని తుంగతుర్తి గ్రామానికి చెందిన నడ్డి రాంచంద్రయ్య, అంజమ్మ కుమారుడు గోపాల కృష్ణ ఏఈఈ ఉద్యోగం సాధించాడు. 2018 సంవత్సరంలో పంచాయతీ కార్యదర్శి, 2019లో రైల్వేలో గ్రూప్–డీ ఉద్యోగం , 2020లో పోలీస్ కానిస్టేబుల్ గా ఉద్యోగం సాధించి ప్రస్తుతం భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్‌లో సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తున్నాడు.

నకిరేకల్‌లో..

నకిరేకల్ : నకిరేకల్‌కు చెందిన నల్లగొండ మనోజ్‌కుమార్ పబ్లిక్ హెల్త్ (మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెం ట్) విభాగానికి ఏఈఈ ఎంపికయ్యారు. మనోజ్ ప్రస్తుతం ఐఐటీ చెన్నైలో ఎంటెక్ చేస్తున్నారు. మనోజ్ తండ్రి నల్లగొండ సత్యనారాయణ మండలంలోని చందుపట్లలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా, తల్లి గజ్జల సరిత నకిరేకల్‌లో భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.

శాలిగౌరారంలో..

శాలిగౌరారం : శాలిగౌరారం పంచాయతీ పరిధిలోని బాలిశెట్టిగూడెం గ్రామానికి చెందిన బట్ట వెంకన్న, పూలమ్మ దంపతుల కుమారుడు విక్రమ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(మిషన్ భగీరథ)ఏఈఈగా ఎంపికయ్యారు. విక్రమ్ 6నుంచి 10వ తరగతి వరకు భువనగిరిలోని ఎస్సీ గురుకుల హాస్టల్, ఇంటర్ హైదరాబాద్‌లోని నాగోల్‌లోని గురుకుల కళాశాల, కాకతీయ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విద్య, బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు.

గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ కార్యదర్శిగా కొలువు సాధించి ప్రస్తుతం మాడ్గులపల్లి మండలంలో పోరెడ్డిగూడెంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. విక్రమ్ ఉద్యోగం సాధించడం పట్ల ఆయన తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మధురానగర్ స్కూల్‌కు తాళం

- ఐదు రోజులుగా తెరుచుకొని పాఠశాల

తాళం వేసి ఉన్న మధురానగర్ ప్రాథమిక పాఠశాల

మర్రిగూడ, ఆగస్టు 3 : మండల కేంద్రంలోని మధురానగర్ ప్రాథమిక పాఠశాలకు తాళం వేశారు. ఐదు రోజులుగా స్కూల్ తెరవడం లేదు. ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయురాలు గత నెల 29న పదోన్నతిపై డిండి మండలానికి బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి పాఠశాలకు ఉపాధ్యాయులెవరూ హాజరు కాలేదు. వరుసగా రెండు రోజులు పాటు విద్యార్థులు పాఠశాలకు వచ్చారని తాళం వేసి ఉండడంతో తిరిగి వెళ్లినట్లు కాలనీవాసులు తెలిపారు. పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు ఉండగా, తక్కువగా ఉన్నారనే సాకుతో పాఠశాలను పూర్తిగా మూసివేసేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తున్నది.

ఈ విషయమై ఎంఈఓ గురువారావును వివరణ కోరగా.. పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయురాలు పదోన్నతిపై వెళ్లారు. ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియ ముగియడంతో ఇతర ఉపాధ్యాయులు వచ్చే అవకాశం లేదు. విద్యార్థులు నష్టపోకుండా సమీప పాఠశాలకు పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రూ.3.75 లక్షలతో మరమ్మతులు

పాఠశాలలో మరమ్మతుల కోసం అమ్మ ఆదర్శ పాఠశాల కింద రూ.3.75 లక్షల అంచనాతో నిధులను మంజూరు చేసినట్లు పంచాయతీ రాజ్ ఏఈ యశ్వంత్ తెలిపారు. బిల్లులు మాత్రం చెల్లించలేదన్నారు.ఒకవేళ అధికారులు పాఠశాలను మూసివేయాలని నిర్ణయం తీసుకుంటే ఈ నిధులు వృథా కానున్నాయి.

బస్సు సౌకర్యం కల్పించాలి : సీపీఎం

మాడ్గులపల్లి, ఆగస్టు 3: మాడ్గులపల్లి–పాములపాడు, పాములపాడు–మిర్యాలగూడకు బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీను కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో మాడ్గులపల్లి నుంచి సూర్యాపేట వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు నడిచేవని, కొద్ది నెలలుగా మాడ్గులపల్లి, ఇందుగుల, ఆగామోత్కూర్, చిరుమర్తి, పోరెడ్డిగూడెం, పాములపాడు గ్రా మాల నుంచి బస్సు సౌకర్యాలు లేక ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు.

ధరణి సమస్యల పరిష్కారానికి చర్యలు : తాసీల్దార్ శ్రీనివాస్

చందంపేట, ఆగస్టు 3: మండలంలో ధరణి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తాసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో రైతుల భూ సమస్యలకు సంబంధించి 1, 120 దరఖాస్తులు వచ్చాయని, ఈ మేరకు వారం రోజులుగా రికార్డులను పరిశీలించి ఇప్పటి వరకు 850 దరఖాస్తులను పరిశీలించినట్లు పేర్కొన్నారు.

త్వరలోనే మిగతా దరఖాస్తులను కూడా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇప్పటికే వాస్తవ రైతులకు ధరణిలో మిస్సింగ్ సర్వే నంబర్లు, తప్పుడు పేర్లు, సరిహద్దులను సరి చేసినట్లు పేర్కొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : సీఐ నాగార్జున

అవగాహన కల్పిస్తున్న సీఐ నాగార్జున

మిర్యాలగూడ, ఆగస్టు 3: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని టూటౌన్ సీఐ నాగార్జున సూచించారు. పట్టణంలోని ఎస్‌పీఆర్ పాఠశాలలో శనివారం మిషన్ పరివర్తన్ ప్రోగ్రాంపై ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు. మాదకద్రవ్యాలను సేవించిన, అమ్మినా చట్టరీత్యా నేరమన్నారు. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా షీటీమ్, డయల్ 100 ప్రాముఖ్యత వంటి వాటి గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ యామిని వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు నాదెండ్ల అయ్యన్న, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలి : కేవీపీఎస్

శాలిగౌరారం, ఆగస్టు 3 : పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టల్‌లో మెస్ చార్జీలను పెంచాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంటెపాక కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ప్యాకెట్ మనీ కోసం రూ. 1,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెలకాని మల్లయ్య, లింగప్రసాద్, బుచ్చిరాములు ఉన్నారు.

మార్చురీలోనే రజిత మృతదేహం

నకిరేకల్, ఆగస్టు 3 : మండలంలోని నోముల గ్రామానికి చెందిన వెల్మకంటి రజిత(28) శుక్రవారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. కాగా రజిత మృతదేహాన్ని శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో పోలీసులు నోముల నుం చి నకిరేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రజిత మృతికి కారణమైన యువకుడి కుటుంబంతో ఆమె తల్లిగారి గ్రామమైన ఆకారం, అత్తగారి గ్రామం అయిన నోముల పెద్ద మనుషులు అప్పటి నుంచి న్యాయం కోసం చర్చలు జరుపుతున్నారు. చర్చలు ఇంకా కొలిక్కి రాకపోవడంతో శనివారం రాత్రి వరకు మృతురాలి బంధువులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు. 32 గంటల పాటు మృతదేహం మార్చురీలోనే ఉంది.

ఒకవేళ బంధువులు పీఎస్‌లో ఫిర్యాదు చేసినా ఆదివారం సెలవు దినం కావడంతో పోస్టుమార్టం చేస్తా రా? లేదా? అనేది తెలియాల్సి ఉంది. ఈ విషయమై సీఐ రాజశేఖర్‌ను వివరణ కోరగా మృతురాలి బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటివరకు ఫిర్యాదు చేయలేదు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తాం. రజిత మృతదేహం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురి గదిలో ఫ్రీజర్‌లో ఉంచినట్లు చెప్పారు.

గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించాలి

- ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి

శాలిగౌరారం: ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి

శాలిగౌరారం, ఆగస్టు 3: గ్రామాల్లో పచ్చదనంతో పాటు పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని శాలిగౌరారం ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి సూచించారు. సోమవారం నుంచి ఈనెల 9వరకు గ్రామీణ ప్రాం తాల్లో స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో శనివారం బండమీదిగూడెం, ఊ ట్కూర్ గ్రామాల్లో పర్యటించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులకు దిశనిర్దేశించారు. ఈసందర్భంగా గ్రామంలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి కూలీ డబ్బులు వస్తున్నాయా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.

స్వచ్ఛదనం –పచ్చదనం విజయవంతం చేయాలి: ఎంపీడీఓ

కొండమల్లేపల్లి : మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో స్వచ్ఛదనం –పచ్చదనం విజయవంతం చేయాలని కొండమల్లేపల్లి ప్రత్యేకాధికారి, ఎం పీడీఓ రాంరెడ్డి అన్నారు. కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ అవరణలో శనివారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. సోమవారం నుంచి ఈ కార్యక్రమానికి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికి కార్యక్రమాన్ని నిర్వాహిం చాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి డాకు నాయక్, ఏపీఎం బొడ్డు శ్రీనివాస్ పాల్గొన్నారు

సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి

నకిరేకల్, ఆగస్టు 3 : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వారోత్సవాలను జయప్రదం చేయాలని జై గౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావు గౌడ్ పిలుపునిచ్చారు. నకిరేకల్ పట్టణంలోని గౌడ సంఘం భవనంలో వారోత్సవాల పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గుండ్రాతి నారాయణ, నాయకులు కొండ రాజేశ్, లింగారపు మధుసూదన్, కొండ జానయ్య పాల్గొన్నారు.

నాంపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ర్యాలీ

నాంపల్లి, ఆగస్టు 3 : మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేవైఎం ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఇంటర్ పూర్తి కాగానే డిగ్రీ కోసం వేరే ప్రాంతానికి వెళ్లడానికి మండల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ, మండలాధ్యక్షుడు నాంపల్లి సతీశ్, చిరుమామిళ్ల గిరిబాబు, పాలగోని శ్రీకాంత్‌గౌడ్, శంకర్, శివగౌడ్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ పోయినది

సమీన భేగం, W/o.షంషుద్దీన్, H.No.5-12-64, రహమత్‌నగర్, నల్లగొండ (Town & Dist.) T.S, నివాసికి చెందిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ (No.4115/2008) మునుగోడ్ రోడ్ నుండి కంచనపల్లి ప్రయాణిస్తుండగ పోయినది దొరికినవారు సంప్ర||8341315921.

ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ పోయినది

సలీమభేగం, W/o.మోహమ్మద్ లతీఫ్, H.No.5-12-64, రహమత్‌నగర్, నల్లగొండ (Town & Dist.) T.S, నివాసికి చెందిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ (No.7520/1987) మునుగోడ్ రోడ్ నుండి కంచనపల్లి ప్రయాణిస్తుండగ పోయినది దొరికినవారు సంప్ర||8341315921.

ప్లాట్ అమ్మబడును

కోదాడ బస్టాండ్ పక్కన, మాత నగర్ వాటర్ ట్యాంక్ అపోజిట్‌లో గల ఓపెన్ ప్లాట్ అమ్మబడును. వివరాలకు సంప్రదించగలరు సెల్:6302986551, 8897494829.

NLG-

PUBLIC HEALTH CHEMICALS

టెమీ ఫాస్ 50% EC, మలాథియన్ 50% EC, పైరిత్రమ్ 2% EC, డెల్టామెత్రిన్ 1.25% ULV, MLO ఆయిల్, పైరోసిన్ ఆయిల్ etc. మునిసిల్ కార్పొరేషన్స్‌కి, గ్రామ పంచాయతీలకి మరియు నగర పంచాయతీలకి సప్లై చేయబడును. డీలర్స్ మరియు మునిసిపల్ కాంట్రాక్టర్స్ సంప్రదించవలసిన నంబర్లు

9346771599, 8790185234, 9701298656

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.

NT-325779-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వెలిమినేడు పీహెచ్‌సీ తనిఖీ

చిట్యాల, ఆగస్టు 3 : మండలంలోని వెల్మినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాసు శనివారం తనిఖీ చేశారు. హైదరాబాద్ నుంచి నల్లగొండకు వెళ్తున్న ఆయన మార్గమధ్యంలో వెలిమినేడు పీహెచ్‌సీని పరిశీలించారు.ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. వైద్యాధికారి నల్లగొండ మీటింగ్ కోసం వెళ్లడంతో అందుబాటులో లేకపోవడంతో డీఎంహెచ్ఓ సిబ్బందితో మాట్లాడారు.

గూడూరు శివారులో గుర్తు తెలియని మృతదేహం

మిర్యాలగూడ, ఆగస్టు 3: మండలంలోని గూడూరు గ్రామ శివారులోగల నార్కట్‌పల్లి–అద్దంకి రహదారి వద్ద శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. రూరల్ ఎస్ఐ నస్ తెలిపిన వివరాల ప్రకారం.. రహదారి పక్కన ఒక వ్యక్తి 45 నుంచి 50 ఏండ్ల వయస్సు గల వ్యక్తి రెండు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలై మృతి చెంది ఉన్నాడు. పశువుల కాపరులు చూసి గూడూరు గ్రామపంచాయతీ సెక్రటరీకి తెలుపగా పరిశీలించి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సదరు గుర్తు తెలియని వ్యక్తి కిష్టాపురం గ్రామం నుంచి రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి శరీరంపై పెసరు రంగు ఫుల్ షర్ట్ (తెలుపు చుక్కలు), నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరచినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ఆర్థిక సాయం

చిట్యాల, ఆగస్టు 3 :చిట్యాలలోని 9వ వార్డుకు చెందిన రుద్రారపు ప్రసాద్ శనివారం మృతి చెందారు. మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి ప్రసాద్ మృతదేహన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశాడు. ఆయన వెంట కౌన్సిలర్లు బెల్లి సత్తయ్య, కోనేటి కృష్ణ ఉన్నారు.

పెట్రోల్ బంకులో చోరీ

చిట్యాల, ఆగస్టు 3 : మండలంలోని గుండ్రాంపల్లి శివారులో గల పెట్రోల్ బంకులో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చొరబడి దాదాపు రూ. 45 వేల నగదును ఎత్తుకెళ్లారు. సంఘటనకు సంబంధించి తెలిసిన సమాచారం మేరకు బంకులోకి శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ముగ్గురు యువకులు ఓ ద్విచక్ర వాహనంపై వచ్చారు. ఆ సమయంలో బంకులో ఇద్దరు సిబ్బంది ఉండగా ఒకరు బంకు కార్యాలయంలో మరొకరు బయట నిద్రిస్తున్నారు. బైక్‌పై వచ్చిన ముగ్గురిలో ఒకరు బంకు కార్యాలయంలో నిద్రిస్తున్న యువకుడిని బెదిరించి అతడి జేబులో ఉన్న దాదాపు రూ. 45 వేల నగదు, ఓ సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయే ప్రయత్నం చేస్తుండగా బయట నిద్రిస్తున్న మరో వ్యక్తికి మేల్కొని ఇద్దరు కలిసి వారిని ప్రతిఘటించే ప్రయత్నం చేసినప్పటికి అది ఫలించలేదు. ఆ ముగ్గు రు వ్యక్తులు నగదు, సెల్‌ఫోన్‌తో పారిపోయారు. ఈ మేరకు శనివారం బంకు సిబ్బంది స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మహారాజశ్రీ పిడుగురాళ్ళ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

ఓ.యస్.నెం.143/2020

బిట్వీన్:
కొలిశెట్టి అనంతరామయ్య –వాది
మరియు
తేడ్ల జయప్రకాష్ మరియు ఇతరులు –ప్రతివాది

1వ ప్రతివాది: తేడ్ల జయప్రకాష్, S/o. అశోక్ బాబు, డోర్ నెం.1-8-607/80, అచ్చయ్యనగర్, శంకరమాత గుడి దగ్గర, నల్లకుంట, హైదరాబాద్-44, తెలంగాణ.

2 వ ప్రతివాది: నాలము శ్రీదేవి, భర్త తేడ్ల జయప్రకాష్ డోర్ నెం.1-8-607/80, అచ్చయ్య నగర్, శంకరమాత గుడి దగ్గర, నల్లకుంట, హైదరాబాద్-44, తెలంగాణ.

పై నెంబర్ దావాలో వాది పరిహారం నిమిత్తం మీపై దావా వేసి వుండుట వలన మీరు స్వతహాగా గానీ, లేక మీ తరపు న్యాయవాది ద్వారా గాని ది.30/08/2024న ఉదయం:10-30 గం||లకు పైన తెలిపిన కోర్టులో హాజరై మీకుగల అభ్యంతరములు తెలియపరుచుకోగలరు. లేనియెడల మీకు పరోక్షంగా దావాలో విచారణ జరిపి తగిన నిర్ణయము పై కోర్టువారు తీసుకొనగలరని దావాను తీర్మానం చేయగలరని పై కోర్టు వారి ఉత్తర్వులు మేరకు మీకు తెలియజేయడమైనది.

ఇట్లు: ఆర్.సాంబశివరావు
అడ్వకేట్, పిడుగురాళ్ళ
సెల్ నెం.9440438199